సాక్షి మంచిర్యాల


గురువారం ׀ 4 ׀ సెప్టెంబర్ ׀ 2025

I



పెన్‌గంగలో వరద ఉధృతి

ఎగువ ప్రాంతాల్లో వర్షాలకు పెన్‌గంగ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అంతర్రాష్ట్ర వంతెన పై నుంచి మహారాష్ట్రకు రాకపోకలను అధికారులు నిలిపివేశారు. IIలో▸



బొజ్జ గణపయ్యకు పూజలు

గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల నైవేద్యాలను సమర్పించారు. IIIలో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0 /25.0

ఉదయం వేళ చిరుజల్లులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

ముగిసిన ఆర్టీసీ కానిస్టేబుళ్ల శిక్షణ



శిక్షణ పొందిన కానిస్టేబుళ్లతో కమాండెంట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో గత నెల 18న ప్రారంభమైన ఆర్టీసీ కానిస్టేబుళ్ల శిక్షణ బుధవారం ముగిసింది. బెటాలియన్ కమాండెంట్ పి.వెంకటరాములు పర్యవేక్షణలో 51వ తెలంగాణ ఆర్టీసీ కానిస్టేబుళ్ల వార్షిక రిఫ్రెషర్ కోర్సు సాగింది. చట్టం, డ్రిల్, క్రమశిక్షణ, భద్రత తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కానిస్టేబళ్లు కూడా ప్రతీ రోజు డ్రిల్, క్రమశిక్షణతో ఉద్యోగం చేస్తూ సంస్థకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అసిస్టెంట్ కమాండెంట్ బాలయ్య, ఆర్ఐ భాస్కర్, బెటాలియన్ అధికారులు, శిక్షణ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

చిన్న తరహా బీరు తయారీ కేంద్రాలకు దరఖాస్తులు

మంచిర్యాలక్రైం: మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మైక్రోబ్రూవరీ(చిన్న తరహా బీరు తయారీ కేంద్రం) ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ తెలంగాణ ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసిందని జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి నందగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను డిప్యూటీ కమిషనర్ కే.రఘురాం, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆదిలాబాద్ కార్యాలయంలో ఈ నెల 25లోపు సమర్పించాలని పేర్కొన్నారు. దరఖాస్తుతోపాటు రూ.లక్ష విలువైన డీడీ, ఆధార్‌కార్డు, కంపెనీ రిజిస్ట్రేషన్ పత్రం, హోటల్, రెస్టారెంట్, 2బీ బార్, ఎలైట్ బార్ లైసెన్స్ పత్రాలు జత చేయాలని తెలిపారు.


కార్పొరేషన్ ఇంచార్జి ఇంజనీర్‌గా రాజేందర్



రాజేందర్‌ను సన్మానిస్తున్న కమిషనర్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఇంచార్జి ఇంజనీర్‌గా రాజేందర్‌ను నియమించారు. ఇంజనీరుగా మసూద్ అలీ గత నెలలో రిటైర్డ్ కాగా, ఆయన స్థానంలో ఏఈగా పనిచేస్తున్న రాజేందర్‌కు పూర్తి స్థాయి ఇంచార్జి బాధ్యతలు(ఎఫ్ఏసీ) అప్పగించారు. ఆయనను బుధవారం కమిషనర్ సంపత్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ బి.రాజమనోహర్, మేనేజర్ ఎస్.కరుణాకర్, సిహెచ్.అనితాదేవి, టీవో మధు, సిబ్బంది సన్మానించారు.

'ఎన్నికల్లో సత్తా చాటాలి'



మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌గౌడ్

చెన్నూర్: రానున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు సత్తా చాటాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. స్థానిక సాయిరాం ఫంక్షన్ హాల్‌లో చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి మండలాల బీజేపీ నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు వార్డు, గ్రామ స్థాయిలో ప్రజలతో మమేకమై ఉండాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొడి రమేశ్, జిల్లా కార్యదర్శి రత్న లక్ష్మీనారాయణరెడ్డి, బత్తుల సమ్మయ్య, బుర్ర రాకేశ్‌గౌడ్, ఏటా మధుకర్, తుమ్మ శ్రీపాల్, జాడి తిరుపతి, శివ కృష్ణ, కేవీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదించాలి'

జన్నారం: బీసీ రిజర్వేషన్ బిల్లుకు గవర్నర్, రాష్ట్రపతి ఆమోదం తెలిపి న్యాయం చేయాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కొడూరి చంద్రయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని బీసీ కులాలకు రిజర్వేషన్ల విషయంలో న్యాయం జరిగే విధంగా చూడాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘం కో కన్వీనర్లు కడార్ల నర్సయ్య, మూల భాస్కర్‌గౌడ్, మంచిర్యాల జిల్లా కన్వీనర్ ఆడేపు లక్ష్మీనారాయణ, కో కన్వీనర్ బాలసాని శ్రీనివాస్‌గౌడ్, మామిడి విజయ్, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గూడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల్లో చేతివాటం!

- ఇందిరమ్మ ఇళ్లలో కొందరి తీరిదీ
- వివరాలు అప్‌లోడ్ చేయడంలో జాప్యం
- లబ్ధిదారుల నుంచి వసూళ్లకు ప్రయత్నాలు



నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం బిల్లుల మంజూరులో అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. కొన్ని చోట్ల లబ్ధిదారులను డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా హాజీపూర్ మండలం కర్ణమామిడి పంచాయతీ కార్యదర్శి బిల్లు మంజూరుకు లబ్ధిదారు నుంచి డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. పునాది, గోడలు, స్లాబ్, ప్లాస్టరింగ్, ఇల్లు పూర్తయ్యే వరకు దఫాల వారీగా మొత్తం రూ.5లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తుంటారు. ఎంపికైన లబ్ధిదారు ఇంటి నిర్మాణం కోసం ముగ్గు పోయడం మొదలు ఆయా దశల్లో ఫొటోలు, వివరాలు అధికార పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కొందరు లబ్ధిదారుల వివరాలు సరిగా లేకపోవడం, కొలతలు హెచ్చుతగ్గులు, ఫొటోలు అప్‌లోడ్ చేసేందుకు జాప్యం చేస్తూ అధికారులు చేతివాటం చూపిస్తున్నారు. ఇక కొందరు తమకు బిల్లులు తొందరగా రావాలనే ఉద్దేశ్యంతోనూ అధికారులకు ఎంతో కొంత ఆశ చూపడం కూడా జరుగుతున్నట్లుగా తెలుస్తోంది.

పరిశీలన జరిగాకే నగదు జమ

ఇంటి నిర్మాణాన్ని పరిశీలన చేసి ఫొటోలు, వివరాలు సరిచూసుకున్నాకే డబ్బులు విడుదలవుతున్నాయి. ఇందుకోసం మొదట పంచాయతీ కార్యదర్శి ముగ్గు పోయడం మొదలు, పునాదులు, గోడలు, స్లాబ్, ఇంటి నిర్మాణం పూర్తయ్యే వరకు జియో ట్యాగింగ్‌తో కూడిన నిర్మాణ కొలతలు, లబ్ధిదారుల వివరాలు నమోదు చేస్తారు. నమోదు చేసిన వివరాల ఆధారంగానే హౌసింగ్ కార్పొరేషన్ ఏఈఈ, తర్వాత డీఈఈ, పీడీ, ఆ తర్వాత ఈఈ, ఎస్ఈ, సీఈ, ఆపైన ఉన్నతాధికారుల దాకా పరిశీలనలు జరుగుతాయి. మొదట క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు నమోదు చేసిన వివరాలు, ఆ తర్వాత పరిశీలించే ఏఈఈలు బిల్లుల మంజూరులో కీలకంగా మారారు. దీంతో లబ్ధిదారుల బిల్లుల చెల్లింపులో కొన్ని చోట్ల అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మొదట ప్రభుత్వ బ్యాంకు ఖాతాల ఆధారంగా డబ్బులు చెల్లింపులు జరిగాయి. ప్రభుత్వం మరింత పారదర్శకంగా పంపిణీ చేయాలనే ఉద్దేశ్యంతో ప్రస్తుతం ఆధార్‌కార్డు అనుసంధానంతో జమ చేస్తోంది. కొంతమందికి ఆధార్ లింకు లేకపోవడం, కొందరి ఖాతాలు పోస్టాఫీసుల్లో ఉండడం, జీరో అకౌంట్ బ్యాలెన్స్ ఉన్నవి, మనుగడ లేని అకౌంట్లు తదితర కారణాలతో నిలిచిపోయాయి. జిల్లాలో 6వేలకు పైగా ఇళ్ల నిర్మాణాలు మొదలు కాగా, వీటిలో సుమారు రూ.16కోట్ల పైగా చెల్లింపులు జరిగాయి. కొన్ని బిల్లుల చెల్లింపులకు పలు కారణాలతో జాప్యం జరుగుతున్నాయి. ఇటీవల కొందరు తమకు బిల్లులు రావడం లేదని కలెక్టర్‌కు కూడా విన్నవించారు.

ఇందిరమ్మ ఇళ్ల వివరాలు

నిర్మాణంలో ఉన్నవి	6,624
ప్రస్తుతం పెండింగ్ బిల్లులు	110
సాంకేతిక కారణాలతో నిలిచినవి	35

డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయండి



ఇందిరమ్మ ఇల్లు బిల్లుల మంజూరు కోసం పంచాయతీ, హౌసింగ్ కార్పొరేషన్ అధికారులకు లబ్ధిదారులు డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం. ఈ క్రమంలో జిల్లాలో లబ్ధిదారులు ఎవరైనా డబ్బులు ఇచ్చినా, అధికారులు ఎవరైనా తీసుకున్నా తమ దృష్టికి వస్తే ఇరువురిపైనా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి దశల వారీగా వారి అకౌంట్లలో డబ్బులు జమ అవుతాయి.

– హౌసింగ్ కార్పొరేషన్ పీడీ వి.బన్సీలాల్

ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

- 'ఇందిరమ్మ' బిల్లు మంజూరుకు డబ్బులు డిమాండ్
- రూ.20వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



డబ్బులతో పట్టుబడిన కర్ణమామిడి కార్యదర్శి అక్కల వెంకటస్వామి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): కటిక పేదరికంతో అద్దె ఇంట్లో ఇంటూ సొంతింటి కల సాకారానికి అష్టకష్టాలు పడుతున్న లబ్ధిదారును పంచాయతీ కార్యదర్శి ఇబ్బందులకు గురి చేశాడు. ఇందిరమ్మ ఇంటి ఫొటో అప్‌లోడ్ చేయాలంటే డబ్బులు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టాడు. కాళ్లు మొక్కుతానన్న కనికరం చూపలేదు. ఎమ్మెల్యే మందలించినా అతడి తీరు మారలేదు. బాధితురాలు ఏసీబీని ఆశ్రయించగా బుధవారం వలపన్ని పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామానికి చెందిన డొల్క నాగమణికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ అప్పు చేసి బేస్‌మెంటు వరకు నిర్మించింది. మొదటి బిల్లు కోసం గ్రామ పంచాయతీ కార్యదర్శి అక్కల వెంకటస్వామిని సంప్రదించగా.. పలు కొర్రీలు పెడుతూ ఫొటో అప్‌లోడ్ చేయాలంటే రూ.30వేలు డిమాండ్ చేశాడు. ఉన్నతాధికారులకు వాటాలు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపాడు. అంత ఇవ్వలేనని వేడుకోగా.. రూ.25వేలు ఇవ్వాలని సూచించాడు. చివరికి రూ.20వేలకు అంగీకరించగా.. మూడు రోజుల్లో ఇస్తానని చెప్పినా వినిపించుకోలేదు. దీంతో బాధితురాలు ఏసీబీ అధికారులను ఆశ్రయించింది. నాగమణి ఇంట్లో రూ.20వేలు తీసుకుంటుండగా కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ, ఆదిలాబాద్ ఇంచార్జి డీఎస్పీ పి.విజయ్‌కుమార్, సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విచారణ అనంతరం అరెస్ట్ చేసి కరీంనగర్‌కు తరలించారు. గురువారం ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, తిరుపతి, కానిస్టేబుల్ పాల్గొన్నారు. కాగా, డబ్బులు ఇచ్చుకోలేనని కాళ్లపై పడినా కనికరించలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. మరణ ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు, పింఛన్ తదితర వాటికి డబ్బులు తీసుకున్నాడని పలువురు గ్రామస్తులు ఏసీబీ డీఎస్పీకి ఫిర్యాదు చేశారు.

ఎమ్మెల్యే మందలించినా..

పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల విషయంలో లబ్ధిదారుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు గతంలో స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన కార్యదర్శిని తీవ్రంగా మందలించారు. అయినా అతడి తీరులో మార్పు రాలేదు. వేధింపులు ఇంకా ఎక్కువయ్యాయి.

అటవీ భూమి కబ్జా

- రెబ్బనపల్లి శివారులో చదును
- పట్టించుకోని అధికారులు



చదును చేసిన అటవీ భూమి

దండేపల్లి: అధికార పార్టీ నాయకులు ఒకరిద్దరు అటవీ భూమిపై కన్నేశారు. దర్జాగా చెట్లు, పొదలు తొలగించి చదును చేశారు. అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. మండలంలోని రెబ్బనపల్లి శివారులో సర్వేనంబరు 444లో 93ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గూడెం, జైదపేట శివారులను ఆనుకుని ఉన్న ఈ భూమిలో రోడ్లు, సాగునీటి కాలువలతోపాటు గతంలో కొందరు పేదలకు కేటాయించారు. 45 ఎకరాలు కొద్ది నెలల క్రితం సీఏ(కంపెన్సేటరీ అటవీ నిర్మూలన భూమి) కింద కేటాయించారు. కొత్తగా అడవుల పెంపకానికి ప్రభుత్వం కేటాయించగా చెట్లు, చెట్ల పొదలతో నిండి ఉంది. ఈ భూమిపై కన్నేసిన సమీప గ్రామాలకు చెందిన ఒకరిద్దరు అధికార పార్టీ నాయకులు రెండ్రోజుల క్రితం జేసీబీలతో సుమారు ఏడు నుంచి పది ఎకరాలు చదును చేసి సాగు ప్రయత్నాలు చేశారు. ప్రభుత్వ భూమి ఎందుకు చదును చేస్తున్నారని, తాము పశువులు ఎక్కడ మేపాలని పశువుల కాపరులు ప్రశ్నించగా.. పట్టా భూమి అని బెదిరించినట్లు తెలిసింది. ఇంతా జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు స్పందించి భూమి కబ్జాకు గురికాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులను సంప్రదించగా, గత కొద్ది నెలల క్రితమే సర్వే నంబరు 444లోని 45 ఎకరాల ప్రభుత్వ భూమిని సీఏ ల్యాండ్ కింద కేటాయించినట్లు తెలిపారు.

నకిలీ చెలా'మనీ'!

- జిల్లాలో యథేచ్ఛగా మార్కెట్లలోకి..
- వినియోగదారులు లక్ష్యంగా మార్పిడి..



పెట్రోల్‌బంక్‌లో వినియోగదారు, సిబ్బంది మధ్య వాగ్వాదం(ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లాలో నకిలీ కరెన్సీ చెలామణి మళ్లీ తెరపైకి వచ్చింది. ఏడాదికోసారి ఎక్కడో ఓ చోట వెలుగు చూస్తూనే ఉంది. చిరు వ్యాపారులు, కూరగాయల వ్యాపారులు, రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని రూ.500, రూ.200 నకిలీ కరెన్సీ చెలామణి చేస్తున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశతో కొందరు మార్పిడి చేస్తున్నారనే చర్చ జరుగుతోంది. చాపకింద నీరులా సాగుతున్న ఈ వ్యవహారంలో అమాయకులు నష్టపోతున్నారు. జిల్లాలో కొందరు బడా వ్యాపారులు సైతం దందాకు తెరతీశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత నెల 29న జిల్లా కేంద్రంలోని ఓ పెట్రోల్ బంక్‌లో నాయికిని పోశం అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంలో రూ.1000 పెట్రోల్ పోయించుకుని నగదు అవసరం కావడంతో రూ.2వేలు ఫోన్ పే ద్వారా చెల్లించాడు. బంక్ ఉద్యోగి రూ.వెయ్యి తిరిగి ఇచ్చే క్రమంలో రూ.200 నకిలీ నోటు ఇచ్చాడు. నకిలీ నోటును గుర్తించిన పోశం యాజమాన్యంతో వాగ్వాదానికి దిగడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

- జిల్లా కేంద్రంలో ఓ వారం రోజుల క్రితం ఇంద్రనగర్‌కు చెందిన ఓ మహిళ కుటుంబ అవసర నిమిత్తం స్థానిక జువెల్లరీ దుకాణంలో రెండు తులాల బంగారు చైను తాకట్టు పెట్టి రూ.లక్ష తీసుకుంది. ఇంటికి వెళ్లిన రెండ్రోజుల తర్వాత వాటిని వేరే వ్యక్తికి ఇచ్చేందుకు సదరు మహిళ భర్త లెక్కించే క్రమంలో అనుమానం వచ్చి పరిశీలించగా రూ.500 నోట్ల కట్టలో మధ్యలో ఐదు నోట్లు నకిలీవిగా గుర్తించాడు. వెళ్లి బంగారం దుకాణం వ్యాపారిని ప్రశ్నించగా.. తనకు సంబంధం లేదని చెప్పడంతో ఏం చేయలేక మిన్నకుండిపోయారు.
- 2021 జనవరి 9న మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి స్థానిక మార్కెట్‌లో కూరగాయలు విక్రయించే మహిళకు రూ.500 నోటు ఇచ్చి రూ.40 విలువైన కూరగాయలు కొనుగోలు చేశాడు. ఆమె మిగతా డబ్బు ఇవ్వగా త్వరగా వెళ్తుండడంతో అనుమానం వచ్చి పక్కనున్న వ్యాపారికి నోటు చూపించింది. నకిలీదనే అనుమానంతో వ్యాపారులు అడ్డుకోగా పారిపోయే ప్రయత్నం చేశాడు. మరో నోటు ఇవ్వాలని అడగడంతో తీసిచ్చాడు. రెండింటిపై ఒకే నంబరు ఉండడంతో అతడిని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనలో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. నకిలీ నోట్ల ప్రింటింగ్‌కు ఉపయోగించిన కలర్ జిరాక్స్ మిషన్, కత్తెర, ప్రింట్ చేసి ఉన్న రూ.500, రూ.200 నోట్లు రూ.56వేల విలువైన కరెన్సీ స్వాధీనం చేసుకున్నారు.

వ్యాపారులు జాగ్రత్త వహించాలి



నకిలీ కరెన్సీ చెలామణి చేసేవారు రూ.500, రూ.200నోటుతో కేవలం రూ.50 విలువైన వస్తువులు కొనుగోలు చేసి వెంటనే వెళ్లిపోతారు. ఇలాంటి సమయంలో వ్యాపారులు జాగ్రత్తగా ఉండాలి. రద్దీ ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేస్తుంటారు. వినియోగదారుడు డబ్బు చెల్లించాక వ్యాపారి తిరిగి చెల్లించే డబ్బుల విషయంలో తొందరపడతాడు. ఇలాంటి వారిపై ఓ కన్నేసి ఉంచాలి. వ్యాపారులు క్యాష్ కౌంటర్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఏమైనా అనుమానం వస్తే వెంటనే 100 డయల్‌కు సమాచారం అందించాలి.

– డీసీపీ ఎగ్గడి భాస్కర్, మంచిర్యాల

సాగుకు అనుగుణంగా ఎరువులు పంపిణీ

- కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలటౌన్: పంటల సాగుకు అనుగుణంగా యూరియా, ఎరువులు పంపిణీ చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో వ్యవసాయ శాఖ అధికారి భూక్యా ఛత్రునాయక్‌తో కలిసి మండల వ్యవసాయ, విస్తరణ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, సకాలంలో కార్యాచరణ ప్రకారం రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. యూరియా పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఫర్టిలైజర్ దుకాణాల నుంచి అధిక మొత్తంలో కొనుగోలు చేసే వారి వివరాలు పరిశీలించాలని అన్నారు.

గ్రామ పాలనాధికారుల నియామక ప్రక్రియ చేపట్టాలి

మంచిర్యాలటౌన్: గ్రామ పాలనాధికారుల నియామక ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ లోకేష్‌కుమార్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. చీఫ్ కమిషనర్ మాట్లాడుతూ నియామక ఉత్తర్వుల పంపిణీ, మార్గదర్శకాలపై పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, కలెక్టరేట్ ఏవో పిన్న రాజేశ్వర్ పాల్గొన్నారు.



ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వద్ద కలెక్టర్ కుమార్ దీపక్

ఎల్లంపల్లి ప్రాజెక్టు సందర్శన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ బుధవారం సందర్శించారు. ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలు తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాలు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. ఎల్లంపల్లి డీఈఈ షేక్ జిలాని, ఏఈఈ హరికృష్ణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న గేట్ల ఎత్తివేత..

ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలకు గాను 18.250 టీఎంసీల నీరుంది. బుధవారం రాత్రి వరకు ఎస్సారెస్పీ నుంచి 1.25లక్షల క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టు నుంచి 11వేల క్యూసెక్కులు, ఎగువ ప్రాంతాల నుంచి 1.30లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో 25గేట్లు ఎత్తి 2.65లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 311 క్యూసెక్కులు తరలిస్తున్నారు.

నిఘా నీడలో నిమజ్జన వేడుకలు

- శోభాయాత్ర ప్రశాంతంగా నిర్వహణకు ఏర్పాట్లు
- మూడు రోజులపాటు నిమజ్జనాలు
- నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు

మంచిర్యాలక్రైం: నిఘా నీడలో వినాయక నిమజ్జన వేడుకల నిర్వహణకు జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని విధాల రంగం సిద్ధం చేసింది. జిల్లాలో 2,400 ప్రతిమలు ఏర్పాటు చేయగా.. శాంతిభద్రతల పరిరక్షణ నేపథ్యంలో ఈ నెల 4న చెన్నూర్, 5న బెల్లంపల్లి, 6న మంచిర్యాలలో హిందు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శోభాయాత్ర ద్వారా నిమజ్జన వేడుకలు నిర్వహించేందుకు నిర్ణయించింది. జిల్లా కేంద్రంలో శోభాయాత్రలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రధాన కేంద్రాల్లో అధునాతన నిఘా నేత్రాలు ఏర్పాటు చేశారు. పూర్తి స్థాయిలో స్థానిక పోలీసుస్టేషన్‌లోని కంట్రోల్ రూం నుంచి ఇద్దరు పోలీసు సిబ్బంది పర్యవేక్షిస్తారు. రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ పర్యవేక్షణలో ముగ్గురు ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు మొత్తంగా 641మంది పోలీసులు, ప్రత్యేక బలగాలు బందోబస్తు నిర్వహిస్తారు. అగ్నిమాపక శాఖ, సింగరేణి, పోలీసు రెస్క్యూ బృందాలు, గజ ఈతగాళ్లను నిమజ్జన ప్రాంతాల్లోఅందుబాటులో ఉంచనున్నారు. శోభాయాత్రను ప్రత్యేక మొబైల్ పోలీసు టీమ్ వీడియో కెమెరాలతో రికార్డు చేయనుంది. గత ఏడాది జరిగిన అల్లర్ల దృష్ట్యా 16మంది పాత నేరస్తులను బైండోవర్ చేశారు. ఈసారి ప్రత్యేక నిఘా విభాగాన్ని ఏర్పాటు చేశారు. శోభాయాత్ర రూట్‌మ్యాప్‌ను ఆయా మండపాల కమిటీ సభ్యులకు అందజేశారు. పోలీసు నిబంధనలు ఉల్లంఘించినవారిపై చట్టపరమైన చర్యలు తప్పవని డీసీపీ భాస్కర్ హెచ్చరించారు.



శోభాయాత్ర మార్గాన్ని పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్

మార్గం ఇలా..

ఈ నెల 6న జిల్లా కేంద్రంలో నిర్వహించే శోభాయాత్రకు పోలీసులు ప్రత్యేక మార్గం ఏర్పాటు చేశారు. ఏసీసీ నుంచి నేరుగా బెల్లంపల్లి చౌరస్తా మీదుగా శోభాయాత్ర ప్రారంభమై తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపం చౌరస్తా మీదుగా ముఖరాం చౌరస్తా మీదుగా బయలుదేరాలి. రెడ్డికాలనీ, చింతపండు వాడ, సంజీవయ్య కాలనీ, రాంనగర్, ఎల్ఐసీ కాలనీ, గౌతమినగర్ కాలనీ గణనాథులు వెంకటేశ్వర టాకీస్, ముఖరాం చౌరస్తా మీదుగా శోభాయాత్ర నిర్వహించాల్సి ఉంటుంది. మూడు ఫీట్లు ఉన్న వినాయకులను నేరుగా జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్ గోదావరిలో నిమజ్జనం చేసుకోవాలి. మూడు ఫీట్ల కంటే ఎక్కువ ఎత్తు గల గణేష్‌లను గూడెం, ఇందారం గోదావరి బ్రిడ్జిల వద్ద నిమజ్జనం చేయాలి. ఆయా ప్రాంతాల్లో అధికారులు భారీ క్రేన్లు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో శోభాయాత్ర నిర్వహించే మార్గాన్ని డీసీపీ భాస్కర్, నగర పాలక కమిషనర్ సంపత్‌కుమార్, ఇతర అధికారులు కాలినడకన పరిశీలించారు. గణపతి మండపాల నిర్వాహకులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

యూరియా కోసం రైతుల ధర్నా



బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్‌ను తోసేస్తున్న సీఐ



చెప్పులు వరుసలో పెట్టి వేచి చూస్తున్న రైతులు

చెన్నూర్: చెన్నూర్‌లోని ఎరువులు, గిడ్డంగుల సముదాయంలో బుధవారం ఎరువులు పంపిణీ చేస్తున్నారని తెలియడంతో రైతులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేచి చూసినా అధికారులు రాకపోవడంతో స్థానిక ఐబీ చౌరస్తాలో బైఠాయించారు. గంటపాటు ధర్నా కొనసాగించారు. వీరికి బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. సీఐ దేవేందర్‌రావు బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ అనిల్‌ను అక్కడి నుంచి నెట్టేశారు. రైతులకు నచ్చజెప్పి పంపించారు.

స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ ఆందోళన

మాజీ కౌన్సిలర్ అనిల్ పట్ల సీఐ వ్యవహరించిన తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజారమేశ్ ఆధ్వర్యంలో నాయకులు స్థానిక పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. బీఆర్ఎస్ గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని, బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రూరల్ సీఐ బన్సీలాల్ బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడారు. అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీనివ్వడంతో ధర్నా విరమించారు.

అదే వరుస..

తాండూర్: యూరియా కొరత రైతులను వెంటాడుతూనే ఉంది. మండలంలోని రేచిని గ్రామంలో బుధవారం యూరియా పంపిణీ చేస్తారనే విషయం తెలుసుకున్న రైతులు ఉదయం నుంచే చెప్పులు వరుసలో ఉంచారు. అధికారుల కోసం వేచి చూశారు. 12 టన్నుల యూరియా సరఫరా కాగా రైతులకు పంపిణీ చేశారు.

'మత్తడివాగు' గేటు ఎత్తివేత



ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని వడ్డాడి వద్ద గల మత్తడివాగు ప్రాజెక్టులోకి వరదనీటి ప్రవాహం కొనసాగుతోంది. బుధవారం 2,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో సాయంత్రం ప్రాజెక్టు ఒక గేటును ఎత్తి 1,500 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.5 మీటర్లు కాగా ప్రస్తుతం 276.90 మీటర్ల వద్ద నిల్వ ఉండేలా నీటిని వదులుతున్నట్లు ఏఈ హరీశ్ కుమార్ తెలిపారు. – తాంసి

స్వర్ణ ప్రాజెక్టు నీటి విడుదల



ఎగువన కురుస్తున్న వర్షాలకు నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలంలోని స్వర్ణ ప్రాజెక్టులోకి 550 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు బుధవారం ఒక గేటును ఎత్తి 985 క్యూసెక్కుల నీటిని దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1183 అడుగులు కాగా ప్రస్తుతం 1182.1 అడుగుల వద్ద స్థిరంగా ఉంచుతున్నామని అధికారులు పేర్కొన్నారు. – సారంగపూర్

'సాత్నాల' గేటు ఎత్తివేత



ఎగువన కురుస్తున్న వర్షాలకు సాత్నాల ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో బుధవారం 1,495 క్యూసెక్కుల నీరు రావడంతో ఒక గేటు ఎత్తి 1,386 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలినట్లు ప్రాజెక్టు జేఈ దీపక్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1.24 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.046 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. – సాత్నాల

'గడ్డెన్నవాగు'కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



భైంసా పట్టణంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎగువన కురిసిన వర్షాలకు బుధవారం ప్రాజెక్టులోకి 648 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా ప్రాజెక్టు అధికారులు ఒక గేటు ఎత్తి 3,300 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా ప్రస్తుతం 358.30 మీటర్ల నీరు నిల్వ ఉంచి నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. – భైంసాటౌన్

క్లుప్తంగా

వర్షానికి కూలిన ఇల్లు



కూలిన ఇంటి వద్ద బాధితులు

నెన్నెల: మండలంలోని నందులపల్లిలో కుమ్మరి మొండికి చెందిన పెంకుటిళ్లు మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ బొమ్మెన హరీశ్‌గౌడ్ బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం, ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

తలమడుగు: మండలంలోని పల్సి(బి) తండాలో పేకాడుతున్న ఐదుగురిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై రాధిక తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి వారి వద్ద నుంచి రూ.1,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వైన్స్‌లో చోరీ

ముధోల్: మండల కేంద్రంలోని రాజరాజేశ్వర్ వైన్స్‌లో మంగళవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై బిట్లా పెర్సిస్ తెలిపారు. వైన్స్ సిబ్బంది రాత్రి షాపు మూసివేసి ఇంటికి వెళ్లారు. బుధవారం వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. యజమాని ఫిర్యాదుతో ఎస్సై బిట్ల పెర్సిస్ షాపును పరిశీలించారు. రూ.13,230 నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. మూడు నెలల క్రితం ఇదే వైన్స్‌లో చోరీ జరిగి రూ.3లక్షల విలువైన మద్యం ఎత్తుకెళ్లినట్లు నిర్వాహకులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

7న బాసర ఆలయం మూసివేత

బాసర: ఈ నెల 7న ఆదివారం సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మధ్యాహ్నం ఒంటిగంటకు మహా నివేదన, హారతి అనంతరం బాసర ఆలయంతో పాటు అన్ని ఉపాలయాలు మూసివేయనున్నట్లు ఈవో తెలిపారు. సోమవారం ఉదయం 4 గంటలకు యథావిధిగా ఆలయం తెరిచి మహా సంప్రోక్షణ నిర్వహిస్తారన్నారు. ఉదయం 7:30 గంటల నుంచి అన్ని ఆర్జిత సేవలు ప్రారంభమవుతాయని, భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

పెన్‌గంగలో వరద ఉధృతి

• మహారాష్ట్రకు నిలిచిన రాకపోకలు



హుడ్కిలి వంతెనపై రాకపోకలు నిలిపివేస్తున్న పోలీసులు



వెంకట్రావ్‌పేట్‌- పోడ్సా వద్ద అంతర్రాష్ట్ర వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరదనీరు

సిర్పూర్(టి): కుమురంభీం జిల్లాతో పాటు ఎగువన ఉన్న మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు పెన్‌గంగ నదిలో వరద ఉధృతి పెరిగింది. బుధవారం సిర్పూర్(టి)– మాకిడి అంతర్రాష్ట్ర రహదారిలోని హుడ్కిలి వంతెన పైనుంచి, సిర్పూర్(టి) మండలంలోని వెంకట్రావ్‌పేట్‌– పోడ్సా అంతర్రాష్ట్ర రహదారిలోని పోడ్సా వంతెన పైనుంచి వరద ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో ఆయా రహదారుల గుండా మహారాష్ట్రకు వాహనాల రాకపోకలు నిలిపివేశారు. సిర్పూర్(టి) మండలం హుడ్కిలి, జక్కాపూర్, మాకిడి గ్రామాలతో పాటు మహారాష్ట్రకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో సమీప గ్రామాల ప్రజలు పెన్‌గంగ నది పరీవాహక ప్రాంతాల వైపు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఎలాంటి సమస్యలున్నా పోలీసులు, అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

'కడెం'కు కొనసాగుతున్న వరద



కడెం: కడెం ప్రాజెక్ట్‌కు బుధవారం రాత్రి 28,174 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ఇరిగేషన్ అధికారులు మూడు వరద గేట్లను ఎత్తి 18,550 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 696.750 అడుగుల నీటిమట్టం ఉంది.

ఉప్పొంగిన తర్ణం వాగు



ఉప్పొంగి ప్రవహిస్తున్న తర్ణం వాగు

సాత్నాల: ప్రజాప్రతినిధులు, అధికారులకు ముందుచూపు లేకపోవడంతో చిరుజల్లు కురిసినా భోరజ్ మండలంలోని తర్ణం వాగు జాతీయ రహదారి 353 బిపై రాకపోకలు నిలిచిపోతున్నాయి. రూ.4.5 కోట్లతో లో లెవెల్ వంతెన నిర్మించినా ఉపయోగం లేకుండా పోయింది. బుధవారం కురిసిన చిరుజల్లులకు లోలెవల్ వంతెనపై నీరు ప్రవహిస్తుండడంతో ఉదయం నుంచి రాకపోకలు నిలిచిపోయి విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చే రోగుల పరిస్థితి మరి దయనీయంగా మారింది.

స్వీట్ హౌస్ సీజ్



శాంపిళ్లు సేకరిస్తున్న అధికారులు

దహెగాం: పాడైపోయిన బాదుషాలు విక్రయించిన మండల కేంద్రంలోని ఓ స్వీట్‌హౌస్‌ను సీజ్ చేశారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని ముత్యంపేట శ్రీ గణేశ్ మండపం వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నిర్వాహకులు మండల కేంద్రంలోని శ్రీబాలాజీ స్వీట్‌హౌస్‌లో 20 కిలోల బాదుషాలు ఆర్డర్ ఇచ్చారు. వాటిని తీసుకెళ్లి వడ్డిస్తుండగా అందులో కొన్ని కుళ్లిపోయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే యువకులు షాపు యజమాని దృష్టికి తీసుకెళ్లగా పొంతనలేని సమాధానం ఇచ్చాడు. దీంతో ఆగ్రహానికి గురైన యువకులు స్థానిక పోలీస్‌స్టేషన్, తహసీల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు డీటీ గణేశ్, ఆర్‌ఐ నాగభూషణం, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌బాబు స్వీట్ హౌస్‌లో తనిఖీలు నిర్వహించి షాపును సీజ్ చేశారు. విషయాన్ని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో శాంపిల్ టేకర్ మల్లికార్జున ఆధ్వర్యంలో చెడిపోయిన బాదుషాలతో పాటు ఇతర వస్తువులు సేకరించారు. వాటిని ల్యాబ్‌కు పంపిస్తామని, రిపోర్ట్ వచ్చిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య




నవీన్ (ఫైల్)

రామకృష్ణాపూర్: పట్టణంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన కుశ్నపల్లి నవీన్ (33)బుధవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు స్థానిక ప్రైవేట్ పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఘటనా స్థలంలో సూసైడ్ నోట్ లభించటం.. అందులో తన ఆవేదనను వెలిబుచ్చుతూ కుటుంబసభ్యులందరినీ ఉద్దేశించి రాయటం పలువురిని కలిచివేసింది. 'అందరూ నన్ను క్షమించండి.. నాభార్య పిల్లలను మంచిగా చూసుకోలేకపోతున్నా, దీనికి తోడు నేను చేసిన చిన్నపాటి అప్పులు కూడా సంకటంగా మారాయి' అంటూ లేఖలో పేర్కొంటూ ఇంట్లో ఉరేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనాస్థలిని పట్టణ ఎస్సై రాజశేఖర్ సందర్శించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని ఒకరు..

దండేపల్లి: భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తహసీనొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లీపూర్‌కు చెందిన రౌతు సురేష్ (44) పూనేలో కూలీ పనిచేస్తున్నాడు. కుటుంబ అవసరాల నిమిత్తం అతని భార్య సువర్ణ తరపు బంధువుల వద్ద కొంత డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. సదరు వ్యక్తులు మళ్లీ డబ్బులు అడగడంతో దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో సువర్ణ ఐదునెలల క్రితం ముంబయిలోని పుట్టింటికి వెళ్లింది. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మూడు రోజుల క్రితం అల్లీపూర్‌లోని తన తల్లి కళావతి వద్దకు వచ్చాడు. బుధవారం ఉదయం తల్లీ స్నానం చేసేందుకు వెళ్లగా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చదువు ఇష్టంలేక బాలిక..



శరణ్య (ఫైల్)

జైపూర్: చదువు ఇష్టంలేక బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కుందారం గ్రామానికి చెందిన దొంతమల్ల గోపాల్ కుమార్తె శరణ్య (13) అదేగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏడోతరగతి చదువుతోంది. చదువుకోవడం ఇష్టంలేక పాఠశాలకు వెళ్లకపోవడంతో పలుమార్లు తండ్రి మందలించి పంపించాడు. బుధవారం స్నానం చేస్తానని బాత్‌రూంలోకి వెళ్లి లుంగీతో ఉరేసుకుంది. ఎంతకూ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు డోరు పగులగొట్టి చూడగా ఉరేసుకుని కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై అభిబ్ తెలిపారు.

ఒంటరితనం భరించలేక వృద్ధుడు..

భైంసాటౌన్: పట్టణంలోని పూలేనగర్‌కు చెందిన అక్విత్‌వార్ గంగారెడ్డి (65) బుధవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నాగభూషణ్, స్థానికుల కథనం ప్రకారం.. వృద్ధుడు స్థానికంగా బట్టల దుకాణంలో గుమాస్తాగా పని చేస్తుండగా భార్య మూడేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందింది. కుమారుడు సైతం కొన్నేళ్ల క్రితం చనిపోగా కూతురికి పెళ్లయింది. గంగారెడ్డి అద్దె ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఒంటరితనం భరించలేక మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానిస్తున్నారు. సమాచారమందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్థానిక ఏరియా స్పత్రికి తరలించారు.

మహిళను వేధించిన ముగ్గురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: మహిళను వేధించిన ముగ్గురు ఆకతాయిలపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు షీటీమ్ ఇన్‌చార్జి ఏఎస్సై బి.సుశీల తెలిపారు. బుధవారం వివరాలు వెల్లడించారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహిళలపై వేధింపులను అరికట్టేందుకు షీటీమ్ బృందాలు అందుబాటులో ఉంటూ ప్రజలతో మమేకమై తిరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గణేశ్ మండపాలను తిలకించేందుకు వచ్చిన మహిళను వేధిస్తున్న ముగ్గురిని పట్టుకున్నట్లు చెప్పారు. వారిలో ఖానాపూర్‌కు చెందిన బబ్లు, బొక్కల్‌గూడకు చెందిన అవేజ్, కుమ్మర్‌వాడకు చెందిన సంతోష్ ఉన్నట్లు తెలిపారు. వేధింపులకు గురైన మహిళలు, యువతులు డయల్ 100, షీటీమ్ 7812659953 నంబరులో సంప్రదించాలని సూచించారు. ఆమె వెంట షీటీమ్ బృందం సభ్యులు వాణిశ్రీ, మహేష్, రోహిని, లావణ్య, తదితరులు ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఒకరిపై..

వాంకిడి: గంజాయి విక్రయిస్తున్న ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్న వాంకిడి గ్రామానికి చెందిన వడై చంద్రశేఖర్ బుధవారం గంజాయి అమ్ముతూ పట్టుబడ్డాడు. అతన్ని తనిఖీ చేయగా 140 గ్రాముల ఎండు గంజాయి లభించింది. నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

దొంగల హల్‌చల్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి దొంగల్ హల్‌చల్ చేశారు. టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని మూడు దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు. తాంసి బస్టాండ్ ప్రాంతంలోని రాశెట్టివార్ సంతోష్ కిరాణ దుకాణంలో చొరబడి రూ.12వేల నగదు ఎత్తుకెళ్లారు. రిమ్స్ ఆస్పత్రి పక్కన గల శశాంక్ మెడికల్‌లో షట్టర్ పగలగొట్టి రూ.3వేల విలువ గల డీవీఆర్ సీసీ కెమెరాలను అపహరించారు. బాలాజీ వైన్స్‌షాప్‌లో కౌంటర్‌లో ఉన్న రూ.2వేలు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మండపాల వద్ద పేకాట ఆడితే కఠిన చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: గణేశ్ మండపాల వద్ద పేకాట ఆడినా, కేటీ తీసినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల్లో ఆదిలాబాద్ పట్టణంలో పేకాట ఆడిన 20 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. మూడు కేసుల్లో 13 మొబైల్ ఫోన్లు, ఒక కారు, ఐదు ద్విచక్ర వాహనాలు, రూ.82,120 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వన్‌టౌన్, టూటౌన్, మావల పోలీసు స్టేషన్‌లలో ఒకటి చొప్పున కేసులు నమోదైనట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే ఆర్డీవోకు సిఫార్సు చేసి భవనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రతీరోజు మండపాలను సెక్టర్, క్లస్టర్ పోలీసు అధికారులు పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు.

కూతుర్ని కిడ్నాప్ చేసిన తండ్రి

• సాయంత్రం ఆలయంలో వదిలివెళ్లిన వైనం

నిర్మల్‌టౌన్: కుటుంబ కలహాల కారణంగా కుమార్తెను తండ్రి కిడ్నాప్ చేసిన ఘటన నిర్మల్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భైంసాకు చెందిన అంజయ్యకు జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్‌కు చెందిన మణితో 11 ఏళ్లక్రితం వివాహమైంది. దంపతులకు నాలుగేళ్ల కుమార్తె సంతానం. కుటుంబ కలహాలతో కొంతకాలంగా దంపతులు దూరంగా ఉంటున్నారు. బుధవారం ఉదయం మద్యం మత్తులో ఉన్న అంజయ్య భార్య ఇంటికి వచ్చి కూతుర్ని ఎత్తుకెళ్లాడు. దీంతో అతని భార్య మణి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. తనకు న్యాయం జరగడం లేదని అంజయ్య భార్య మణి కుటుంబ సభ్యులతో కలిసి పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేసింది. తమ కూతుర్ని రక్షించాలని వేడుకుంది. కాగా బుధవారం సాయంత్రం అంజయ్య తమ కూతుర్ని తీసుకువచ్చి బాధితురాలి ఇంటి సమీపంలో ఉన్న హనుమాన్ ఆలయంలో వదిలివెళ్లినట్లు సీఐ తెలిపారు.

అదుపుతప్పి లోయలోపడిన కారు



సంఘటన స్థలంలో కారు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ శివారులో మంగళవారం రాత్రి ఓ కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న లోయలో పడింది. దీంతో కారులో ఉన్న కడెం మండల కేంద్రానికి చెందిన బాలిక అనన్యతో పాటు చందు, ప్రసాద్, దేవాన్ష్‌లకు గాయాలయ్యాయి. 108కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఈఎంటీ కృష్ణ, పైలట్ అజర్ హుస్సేన్ తెలిపారు. కాగా బాధిత కుటుంబ సభ్యులు మహారాష్ట్రలోని పాలజ్‌కు వెళ్లి వస్తుండగా ఘటన చోటు చేసుకున్నట్లు వారు పేర్కొన్నారు.

'జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలి'



మాట్లాడుతున్న గోడం గణేశ్

ఆదిలాబాద్‌రూరల్: ఉప రాష్ట్రపతిగా పోటీ చేస్తున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి పౌర సమాజం మద్దతుగా నిలవాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ కోరారు. బుధవారం మావల మండలంలోని కుమురంభీం గూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య భవిష్యత్ దృష్ట్యా సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా నిలబడాలని పార్లమెంట్ సభ్యులందరికీ విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. పార్టీవాళ్లకే ఓటు వేయాలని నిబంధన రాజ్యాంగంలోనూ ఎక్కడా లేదన్నారు. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు రాజ్యాంగబద్ధంగా తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. సమావేశంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదిలాబాద్ డివిజన్ అధ్యక్షుడు ఆత్రం గణపతి, మావల మండల అధ్యక్షుడు వెడ్మ ముకుంద్, నాయకులు రమేశ్, రాంకిషన్ పాల్గొన్నారు.

దూరవిద్యలో పీవీటీజీలకు ఉచిత ప్రవేశం

• డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

ఆదిలాబాద్‌టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం ద్వారా అందిస్తున్న కోర్సుల్లో ఆదిమ గిరిజనులు (పీవీటీజీ)లకు ఉచితంగా ప్రవేశం కల్పించనున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టూడెంట్ సర్వీస్ డైరెక్టర్ డాక్టర్ వై.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ యూనివర్సిటీ ప్రాంతీయ అధ్యయన కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా, వివిధ కారణాలతో ఉన్నత చదువు కొనసాగించని వారికి ఇది ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సమతా సపోర్ట్ స్కీమ్ కింద కొలాం, కోయ, కొండరెడ్డి, గోండు, తోటి కులాల వారు కేవలం రూ.500 తోనే అడ్మిషన్ పొందవచ్చన్నారు. దివ్యాంగులకు సైతం అడ్మిషన్లు కల్పించనున్నట్లు తెలిపారు. త్వరలో ఉమెన్ హబ్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఉట్నూర్‌లో స్టడీ సెంటర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డిగ్రీ, పీజీ అడ్మిషన్ కోసం ఈనెల 12 వరకు గడువు ఉందన్నారు. ఆదిలాబాద్‌లోని అధ్యయన కేంద్రంలో కొత్తగా సైన్స్‌కు సంబంధించిన పీజీ కోర్సు, లైబ్రరీ కోర్సును ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. అంతకుముందు కోర్సులకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన వెంట ప్రొఫెసర్లు గుంటి రవీందర్, పరాంకుశం, వెంకటరమణ, ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ జగ్‌రాం అంతర్వేది, తదితరులు ఉన్నారు.

ఉట్నూర్ కళాశాలను సందర్శించిన యూనివర్సిటీ బృందం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లో స్టడీ సెంటర్ ఏర్పాటు కోసం బుధవారం యూనివర్సిటీ బృందం సభ్యులు వెంకటేశ్వర్లు, రవీందర్ కేబీ ప్రాంగణంలోని డిగ్రీ కళాశాలను సందర్శించినట్లు ప్రిన్సిపాల్ టి.ప్రతాప్‌సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు.

చిరుతదాడిలో ఎద్దు మృతి

• ఊపిరాడక మరొకటి..

తానూరు: చిరుతపులి దాడిలో రెండు ఎద్దులు మృతి చెందిన సంఘటన మండలంలోని మసల్గాతండాలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జాదవ్ దేవిదాస్ మంగళవారం రోజంతా తమ ఎద్దులను మేపి సాయంత్రం పొలంలోనే కట్టేసి ఇంటికి వచ్చాడు. రాత్రి సమయంలోచిరుతపులి ఒక ఎద్దుపై దాడిచేసి హతమార్చింది. ఈక్రమంలో భయాందోళన చెందిన మరో ఎద్దు తప్పించుకునే క్రమంలో మెడకు ఉరిపడి ఊపిరాడక మృతి చెందింది. బుధవారం ఉదయం సదరు రైతు పొలానికి వెళ్లి చూడగా రెండు ఎద్దులు మృతిచెంది కనిపించాయి. చిరుతపులి ఆనవాళ్లు కనిపించడంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాడు. ఎఫ్ఆర్వో రమేశ్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. చిరుతదాడిలో ఎద్దు మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

ప్రభుత్వ ఉద్యోగిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఉద్యోగం ఇప్పిస్తానని ఓ నిరుద్యోగి వద్ద డబ్బులు వసూలు చేసిన ప్రభుత్వ ఉద్యోగిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఆదిలాబాద్‌అర్బన్ ఎంఈవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఖానాపూర్‌కు చెందిన ముఖీద్ అహ్మద్ టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని నిరుద్యోగి లావణ్య వద్ద రూ.45వేలు తీసుకున్నాడు. రూ.లక్షకు బేరం కుదుర్చుకొని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. గతేడాది డిసెంబర్ 16న డబ్బులు తీసుకోగా అప్పటి నుంచి ఉద్యోగం ఇప్పించకపోగా, తీసుకున్న డబ్బులు కూడా ఇవ్వకపోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

జాతీయస్థాయి శిక్షణకు ఎంపిక



జాడి శ్రీనివాస్

నిర్మల్‌ఖిల్లా: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ-2020)లో భాగంగా జాతీయస్థాయిలో నిర్వహించనున్న శిక్షణకు తెలంగాణ రాష్ట్రం నుంచి 10 మంది ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను ఎంపిక చేసింది. అందులో నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న జాడి శ్రీనివాస్‌కు చోటు దక్కింది. ఈనెల 8 నుంచి 27 వరకు హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఉపాధ్యాయుల జాబితాతో కూడిన ఉత్తర్వులను బుధవారం ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ జి.రమేశ్ జారీ చేశారు. జాడి శ్రీనివాస్ గత మే నెలలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన బోధనాభ్యసన ప్రక్రియల్లో బెస్ట్ ప్రాక్టీసెస్ విభాగంలో ఎంపికై రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రదర్శననిచ్చారు.

ఎస్పీఎంలో ప్రమాదం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సిర్పూర్ పేపరు మిల్లులో బుధవారం ఫైబర్‌లైన్ లీక్ కావడంతో సమీపంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుడు ఎన్నం భాస్కర్ వీపుపై కెమికల్ పడి వెనకభాగం పూర్తిగా కాలిపోయింది. గమనించిన తోటి కార్మికులు ముందుగా స్థానిక ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌కు తరలించారు.



జాతీయ పోషకాహార వారోత్సవాలు

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
గురువారం ॥ 4-9-2025

ఫుడ్ ఫర్ టీన్స్



పిల్లల విషయంలో పెద్దవారికి ఒక రకమైన ఆందోళన ఉంటే... కాస్త పెద్ద పిల్లల విషయంలో ఇంకో రకమైన ఇబ్బందులు ఉంటాయి. అంటే పదేళ్లు దాటి టీనేజ్‌లో ఉండే పిల్లల్లో మరికొన్ని సమస్యలు చూస్తుంటాం. ఈ రోజుల్లో అయితే టీనేజ్ పిల్లల్లో ఆందోళన, మానసిక ఒత్తిడి, అధికంగా కోపం, డిప్రెషన్ వంటివి తరచూ వింటున్నాం. వారు తినే ఆహారపు ప్రభావం మానసిక, శారీరక స్థితిపైన చూపుతుంది. అందుకని, టీనేజ్ పిల్లలున్న ఇంట్లో పోషకాహారం పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలి.

13–19 ఏళ్ల మధ్య ఫిజికల్, మెంటల్ గ్రోత్ వేగంగా మార్పు చెందుతుంటుంది. ఇలాంటప్పుడు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎమ్ఆర్) కొన్ని సాధారణ సూచనలు చేసింది. వాటి ఆధారంగా పోషకాహారాన్ని ఈ వయసు పిల్లలకు సరైన మొత్తంలో ఇవ్వాలి. అలాగే, ఆ ఆహారం మనసుకు సంతృపినిచ్చేలా ఉండాలి.

టీనేజ్ పిల్లల బరువు, ఎత్తు, చేసే పనులు.. ఇవన్నీ దృష్టిలో నిపుణుల సలహాతో సమతుల ఆహారాన్ని ప్లాన్ చేసుకోవచ్చు. ఎక్కువ మొత్తంలో కాకుండా రోజులో 5-6 సార్లు సమయాన్ని బట్టి పైన టేబుల్‌లో ఇచ్చిన హెల్తీ ప్లేట్‌ను తయారుచేసుకోవచ్చు.

బ్రేక్‌ఫాస్ట్
కప్పు గోధుమ ఉప్మా /దోసె - 2 / కిచిడీ - కప్పు / రాగి రొట్టె - 2 -3 / ఇడ్లీ - 2-3 + కప్పు సాంబార్ + ఉడికించిన గుడ్డు లేదా ఆమ్లేట్ + కొద్దిపాటి గింజలు.

ఉదయం స్నాక్స్
పండు (ఆపిల్ లేదా అరటి లేదా నారింజ) + కొద్దిగా డ్రైఫ్రూట్స్ / పల్లీ చిక్కీ / వేపిన శనగలు / వేయించిన అవిసెగింజలు / డ్రై ఫ్రూట్ బార్ / ఉడికించిన వేరుశెనగ

మధ్యాహ్న భోజనం
అన్నం - 1 కప్పు లేదా గోధుమ రొట్టె - 2-3 / తృణ ధాన్యాలు - 1 కప్పు + ఆకుకూరలు - 1 కప్పు + మిక్స్‌డ్ వెజిటబుల్స్ - 1 కప్పు + చికెన్ బ్రెస్ట్ - 100 గ్రా / గుడ్డు - 1 / పనీర్ - 100 గ్రా / చేప - 100–120 గ్రా. + పెరుగు - 1 కప్పు

సాయంత్రం స్నాక్స్
మొలకెత్తిన గింజలు, విత్తనాలు - 30 గ్రా + చియా సీడ్స్ + నిమ్మ రసం/ పాలు/ పండు జ్యూస్ లేదా సూప్.

రాత్రి భోజనం
మధ్యాహ్న భోజనం మాదిరి గానే + గ్రిల్ చేసిన చికెన్ బ్రెస్ట్ అన్నంతో లేదా రొట్టెతో + కూరగాయలు + ఉడికించిన బ్రొకోలీ

కిలో కేలరీలు : అబ్బాయిలకు 2200-3200 : అమ్మాయిలకు 1800 - 2500
ప్రొటీన్లు : అబ్బాయిలకు - 52 గ్రా. : అమ్మాయిలకు - 46 గ్రా.
కొవ్వులు (Fat) : 25-35%
కార్బోహైడ్రేట్స్ : 45-65%
విటమిన్-ఎ : 600-900 మైక్రోగ్రాములు
విటమిన్ - సి : 45-75 మి.గ్రా
కాల్షియం : 1300 మి.గ్రా నీళ్లు - 8 నుంచి 12 గ్లాసులు



– డా. సుజాతా స్టీఫెన్, న్యూట్రిషనిస్ట్

ఫుడ్ గ్రూప్స్, పరిమాణం

ఏదైనా పండు	- 1 రోజుకు 2-3 సర్వింగ్స్
కూరగాయలు	- రోజుకు 3-5 సర్వింగ్స్ (ఉడికించినవి లేదా వండినవి)
ధాన్యంతో వండినవి	- రోజుకు 6 - 8 సర్వింగ్స్ (1 సర్వింగ్ - ½ కప్పు ఉడికిన అన్నం/సిరిధాన్యం/గోధుమ)
డెయిరీ ఉత్పత్తులు	- రోజుకు 2 - 3 కప్పులు (పాలు, పెరుగు, చీజ్ రూపంలో)
ఆరోగ్యకరమైన కొవ్వులు	- రోజుకు 1 టేబుల్ స్పూన్ (నూనె, గింజలు, విత్తనాలు మొదలైనవి)
ప్రొటీన్ ఆహారం	- మాంసం, గుడ్డు మొదలైనవి (1 సర్వింగ్)

● మన(సు)లో మాట

తీవ్ర మనోవ్యాధికి సంజీవని!

మేము కోయంబత్తూరులో సెటిల్ అయిన తెలుగు వాళ్లము. మా అబ్బాయి బీటెక్ తర్వాత ఎం. ఎస్. కోసం సంవత్సరం క్రితం అమెరికాకు వెళ్లాడు. మొదట 6 నెలలు బాగానే ఉన్నాడు. తర్వాత అతని ఆలోచనలు, ప్రవర్తనలు మారాయి. అమెరికాలో ఉన్న పోలీసులు, గూఢాచారులు తనని వెంబడిస్తున్నారని తన మెదడు మీద, ఎలాన్ మస్క్, ట్రంప్ ప్రయోగాలు చేస్తున్నారని అనుమానంతో భయపడుతూ–ఉండేవాడు. ఆ ప్రవర్తన ఎక్కువై బాగా చికాకు చేస్తే అక్కడే ఉండే మా చుట్టాలు 6 నెలల క్రింద ఇండియాకు పంపించారు. ఎయిర్ పోర్టులో దిగాక నేరుగా చెన్నైలో ఒక ఆస్పత్రిలో అడ్మిట్ చేశాము. 'స్కిజోఫ్రినియా' లక్షణాలు ఎక్కువగా ఉన్నాయని, బాగా అగ్రెసివ్‌గా, సూసైడల్ ఆలోచనలతో ఉన్నాడని అక్కడి డాక్టర్లు ఇ.సి.టి. ట్రీట్మెంట్ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. మా ఫ్యామిలీ డాక్టర్‌ని అడిగితే ఆయన ఇ.సి.టి. వల్ల మెదడు దెబ్బతింటుంది, భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయని చెప్పారని, మేము ఆ ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ చేసి వేరే హాస్పిటల్‌కి తీసుకెళ్లాము. పెద్దగా ఫలితం కనిపించకపోయేసరికి ఇంగ్లీష్ వైద్యం కాకుండా వేరేవైద్యానికి వెళ్ళాము. చాలా రోజులు ఆ మందులు వాడినా ఎలాంటి మార్పు లేదు. దయచేసి మాకు ఏదైనా మంచి దారి చూపగలరు.

– **సోమలింగేశ్వరరావు**, కోయంబత్తూరు

చాలామందిలో అంతర్గతంగా ఉండే ఇలాంటి సమస్యను సాక్షి ద్వారా తెలియజేసినందుకు మీకు నా అభినందనలు. మీ అబ్బాయికి వచ్చిన స్కిజోఫ్రీనియా వ్యాధి వలన ఎంతగా సంఘర్షణకి గురయ్యారో అర్థం అవుతోంది. ముందుగా మీరు అర్థం చేస్కోవాల్సింది, మెదడులో వచ్చే కొన్ని రసాయనిక మార్పుల వల్లనే ఇలాంటి మానసిక సమస్యలు వస్తాయని, అవి తగ్గాలంటే ఆ రసాయనాలని సాధారణ స్థితికి తీసుకురావాలనీ మానసిక వైద్యులు మొదటిగా మందులు, కౌన్సెలింగ్ ద్వారా మార్పులు తీసుకురావడానికి ప్రయత్నం చేస్తారు.

అయితే కొన్నిసార్లు ఆ సమస్య తీవ్రంగా ఉన్నప్పుడు లేదా పేషెంటుకి ఆత్మహత్య ఆలోచనలు, జబ్బువల్ల ఇతరులకు హాని చేసేంత ఆవేశం, కోపం, ఉన్నప్పుడు, మందులు పని చేయడానికి చాలా సమయం పట్టొచ్చు; అలాంటప్పుడు పేషెంటుకి కుటుంబ సభ్యులకి జరిగే నష్టం ఎక్కువ. దీన్ని నివారించడం కోసం అత్యంత వేగంగా. ప్రభావ వంతంగా పనిచేసే ఒక సంజీవని లాంటి వైద్య విధానమే' ఇ.సి.టి. ఎలక్ట్రో కన్వల్సివ్ థెరపీ. అంతమంచి చికిత్స విధానాన్ని వాడుక భాషలో 'షాక్ ట్రీట్మెంట్' అంటారు. అదే అన్ని సమస్యలకి, అపోహలకి కారణం అయింది. దీనివల్ల మనిషికి ప్రాణహాని అని లేదా నరాలు చచ్చుబడి, సంసారానికి పనికి రారు అని అనేక అపోహలు, సాధారణ ప్రజలతో పాటు, కొంత మంది వైద్యుల్లో కూడా ఉన్నాయి. మన శరీరంలో ఇతర జ్ఞానేంద్రియాలు, కండరాలు ఇతర వ్యవస్థలన్ని పనిచేయడానికి మెదడులో ఉత్పత్తి అయ్యే కరెంట్ చాలా ముఖ్యం. దాన్ని మార్చడం ద్వారా మెదడులోని రసాయనాల అసమతుల్యను కూడా సరి చేయవచ్చు. ఒక రకంగా చెప్పాలంటే ఫోన్ లేదా కంప్యూటర్ కి వైరస్ వచ్చి పని చేయక పోతే రీసెట్ ' బటన్ నొక్కి దాన్ని పనిచేసే కండిషన్‌కి ఎలా తీసుకు వస్తామో ఇ.సి.టి. కూడా మెదడుని అలాగే రీసెట్ చేస్తుంది. దీనివల్ల దీర్ఘకాలికంగా ఎలాంటి సమస్యలు వస్తాయని ఇప్పటి వరకు ఎలాంటి శాస్త్రీయ పరిశోధనా తేల్చలేదు. ఒక పేషెంట్ అన్ని రకాలుగా శారీరకంగా ఫిట్‌గా ఉంటేనే ఇ.సి.టి. చికిత్స చేస్తారు. మీ అబ్బాయిని పరీక్షించిన డాక్టరు అన్ని పరీక్షలు చేసి ఎలాంటి ఇబ్బంది లేకపోతేనే ఇ.సి.టి. ట్రీట్మెంట్ గురించి చెప్పి ఉంటారు. కాబట్టి ఎలాంటి అపోహలు, భయాలు లేకుండా చికిత్స ఇప్పించి, మీ వాడి జబ్బు లక్షణాలను తొందరగా తగ్గించుకోండి.

మీ అలాగే వాళ్ళు చెప్పినన్ని రోజులు మందులు వాడితే జబ్బు మళ్ళి తిరిగబెట్టకుండా ఉంటుంది. ఆల్ ది బెస్ట్ !




డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన
మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

● బయోపిక్

వెండితెరపై కశ్మీర్ కోయిల

మనకు ఎం.ఎస్. సుబ్బులక్ష్మి తెలుసు.
మహనీయ కర్నాటక సంగీత విద్వాంసురాలు.
లతా మంగేష్కర్ తెలుసు. సినీ సంగీతానికి రారాణి.
కాని రాజ్ బేగం తెలియదు.
ఆమె వీరిద్దరి కాలం నుంచే పాడుతోంది.
వీరితో సమానంగా కశ్మీర్ ప్రజల జేజేలు అందుకుంది.
కశ్మీర్ కోయిల బిరుదు అందుకుంది.
కాని ఆమె దేశానికి తెలియడానికి ఇంత కాలం పట్టింది.
అదికూడా ఇప్పుడు ఆమె జీవితం ఆధారంగా తీసిన 'సాంగ్స్ ఆఫ్ పారడైజ్'
సినిమా అమేజాన్‌లో విడుదల అయ్యాక.



1950ల కాలం ఊహించండి.

కశ్మీర్ పర్వత ప్రాంతం. అక్కడివన్నీ గిరిజన సంప్రదయాలు. కశ్మీర్‌కే తనదైన గొప్ప సంగీతం, గానం, వాయిద్యం, కవిత్వం, గీతం... ఉన్నాయి. అక్కడ కశ్మీరీ భాషలో ఎంతో మంచి సాహిత్యం ఉంది. కాని అక్కడ ఉర్దూ, హిందీ కూడా వాడుకలో ఉంది. నిరంతరం ఏదో ఒక అలజడికి లోనయిన ఆ ప్రాంతంలో స్త్రీలు ఏ పనిలో అయినా ముందుకు రావడం కష్టంగా ఉండేది. వారి కళ కూడా నాలుగ్గోడల మధ్యే తప్ప బహిరంగం కావడానికి లేదు.

ఈ నియమాన్ని బ్రేక్ చేసిన గాయని రాజ్‌బేగం.

1927లో శ్రీనగర్‌లో జన్మించిన రాజ్‌బేగం బాల్యంలోనే పాటను గ్రహించింది. అది అక్కడ కురిసే మంచులా ఆమెలో సహజంగా ఉద్భవించింది. గిరిజన గీతాలు, జానపద పాటలు పెళ్లిళ్లలో పాడటం మొదలు పెట్టింది. 1950లలో ఆమె మొదటిసారి ఆల్ ఇండియా రేడియో కశ్మీర్ స్టేషన్‌లో పాడింది. మరో నాలుగేళ్లకు అదే రేడియోలో స్టాఫర్ అయ్యింది. ఆ తర్వాత బహిరంగ వేదికల మీద పాడసాగింది. తన జీవిత కాలంలో కనీసం రెండు వేల పాటలు ఆమె పాడింది. అయితే దురదృష్టవశాత్తు ఏ పాట రికార్డింగూ అందుబాటులో లేదు. కశ్మీర్ సంగీతానికి ఆమె చేసిన సేవకు 2002లో 'పద్మశ్రీ' దక్కినా ఆమెకు రావాల్సిన ఖ్యాతి రాలేదు. 2016లో రాజ్ బేగం మరణించింది. జనం ఆమెను అక్కడ నిత్యం తలుచుకుంటూనే ఉంటారు. దేశానికి ఆమె పేరు చేరలేదు. కశ్మీర్‌లో పుట్టి పెరిగి అమెరికాలో చదువుకొని వచ్చిన అక్కడే స్థిరపడ్డ దర్శకుడు డానిష్ రెంజు ఆమె బయోపిక్‌ను తీసే అవకాశం పొందగలిగాడు. రాజ్ బేగం జీవితాన్ని, సంగీతాన్ని 'సాంగ్స్ ఆఫ్ పారడైజ్'గా తీశాడు. అమేజాన్‌లో ఆ సినిమా ఆగస్టు 29 నుంచి స్ట్రీమ్ అవుతూ విమర్శకుల ప్రశంసలు పొందుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయ సంగీత అభిమానుల మెప్పు అందుకుంటోంది. దర్శకుడు ఫర్హాన్ అఖ్తర్ ఈ సినిమాకు ఒక నిర్మాత కావడం విశేషం.

***

'అమ్మా... దేవుడు స్త్రీలను పుట్టించింది కేవలం పెళ్లి కోసం కాదు' అని తన యవ్వన కాలం నుంచి తిరగబడుతూ తన దారిని నిర్మించుకుంటుంది రాజ్ బేగం 'సాంగ్స్ ఆఫ్ పారడైజ్' సినిమాలో. పెళ్లిళ్లలో పాడుతూ గుర్తింపు పొందిన రాజ్ బేగం రేడియో కశ్మీర్‌లో ఆడిషన్ ఇవ్వడానికి వెళితే అక్కడంతా అబ్బాయిలే ఉండి 'సువ్వొచ్చావ్ ఏంటి' అన్నట్టుగా చూస్తారు. అయినా వారిని ఎదిరించి ఆడిషన్ ఇచ్చి ఎంపికవుతుంది రాజ్ బేగం. అయితే స్థానిక పరిస్థితుల దృష్ట్యా ఆమె తన సొంత పేరును చెప్పుకోవడానికి వీలుండదు. 'నూర్ బేగం' పేరుతో రేడియోలో పాడుతుంది. ఇది కొన్నాళ్లకు తెలిసి ఆమె ఊరి వాళ్లు తీవ్రంగా వ్యతిరేకిస్తారు. ఆడపిల్ల ఇలా మగవాళ్లుండే చోటుకు వెళ్లి పాడటం ఏంటని రాళ్లతో కొడతారు. బహిరంగ వేదికల మీదకు రాకుండా చూస్తారు. రాజ్ బేగం ఇవన్నీ తట్టుకుని తన పాటను జనం వద్దకు తీసుకువెళుతుంది. ఏ జనమైతే ముందు వ్యతిరేకించారో వారంతా ఆమె అభిమానులుగా మారతారు. ఆమెను తమ ప్రాంతపు సాంస్కృతిక రాయబారిగా చేసుకుంటారు. ఆమె పాటలకు పరవశిస్తారు. తన జీవితంలో వేల కొలది పాటలు పాడి రాబోయే తరాలకు స్ఫూర్తినిచ్చింది రాజ్ బేగం. ఆమె వేసిన దారిలో ఇవాళ ఎందరో కశ్మీర్ గాయనులు పాటలు పాడుతున్నారు. రాజ్ ఎదుర్కొన్న వ్యతిరేకత వీరికి లేదు.



'సాంగ్స్ ఆఫ్ పారడైజ్'లో యంగ్ రాజ్ బేగంగా సబా ఆజాద్, వృద్ధ రాజ్ బేగంగా సోని రాజ్‌దాన్ (ఆలియా భట్ తల్లి) నటించారు. సినిమా హిందీ భాషలో సాగినా పాటలు కశ్మీర్ సువాసనలతో ఉంటాయి. కశ్మీర్ జీవితం, సంప్రదాయాలు, మాటా, వరుస... అన్నీ ఈ సినిమాలో కనిపిస్తాయి.

ఇన్నాళ్లకు కశ్మీర్ సినిమా ఒకటి వచ్చింది.

అది ఒక గాయని గురించి కావడం సంతోషపడవలసిన సంగతి.

కళ మరణించదని మరోసారి నిరూపితమైంది.



● పద్మశ్రీ అందుకుంటున్న రాజ్ బేగం

● పేరెంటింగ్

ఒక హీరో గురించి...

పిల్లలకు ఎప్పుడూ బడి పాఠాలే కాదు బతుకు పాఠాలు, నైతిక విలువల గురించి కూడా చెప్పాలి. అదే నిజమైన పేరెంటింగ్. ఒక తండ్రి తన పిల్లాడికి సులువైన భాషలో మంచీచెడుల గురించి చెప్పిన మాటలు నెటిజనులకు తెగ నచ్చాయి.

ఫైనాన్షియల్ సర్వీసెస్ 'మైఫండ్‌బాక్స్' సీయివో అనూజ్ పాల్...

'నీ గురించి స్కూల్‌లో ఏమైనా ఫిర్యాదులు ఉన్నాయా?' అని తన చిన్నారిని అడిగాడు.



'నేను ఒకరిని కొట్టాను' అన్నాడు అద్విక్.

'ఎవరిని కొట్టావు? ఎందుకు కొట్టావు?' అని అడిగిన తండ్రి... 'ఒక అమ్మాయిని అలా కొట్టవచ్చా?

నువ్వు ఆ అమ్మాయి వస్తువు లాగేసుకున్నావు. ఇతరుల వస్తువులు అలా లాక్కోవచ్చా? మీ క్లాస్‌మేట్స్ ఇద్దరు కలిసి నిన్ను కొట్టారనుకో, నీకు బాధగా అనిపించదా? వాళ్లు చేసింది తప్పు అనిపించదా... ఇది సరే, నువ్వు భవిష్యత్‌లో ఏం కావాలనుకుంటున్నావు? హీరో అవుతావా? విలన్ అవుతావా?' అని అడిగాడు అనూజ్.

'హీరో' అని జవాబు చెప్పాడు అద్విక్.

'తప్పు చేసినప్పుడు సారీ చెప్పేవారే నిజమైన హీరోలు. మరి నువ్వు సారీ చెబుతావా?' అని అడిగాడు తండ్రి. అద్విత్ ఆ అమ్మాయికి 'సారీ' చెప్పాడు! ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది.

● టెక్నో ఉమెన్

ఛాయా చిత్రం



'మెటా'లో దశాబ్దకాలం పాటు పనిచేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్పెషలిస్ట్ ఛాయ నాయక్ తాజాగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ 'ఓపెన్ ఏఐ'లో చేరింది. ఓపెన్ ఏఐలో ఆమె 'స్పెషల్ ఇనిషియేటివ్స్' టీమ్‌లో పనిచేయనుంది.

'సరియైన సమయంలో సరియైన నిర్ణయం' అని కంపెనీ మార్పు గురించి స్పందించింది ఛాయ. మహారాష్ట్రలోని పుణేకు చెందిన ఛాయ నాయక్ సెక్యూరిటీ, పీస్ స్టడీస్‌లో డిగ్రీ చేసింది. యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో పబ్లిక్ పాలసీ, డాటా సైన్స్‌లో మాస్టర్స్ ప్రోగ్రామ్ చేసింది. పుణేలో 'పాత్‌వేస్ టు ఎంపవర్‌మెంట్'లో ప్రాజెక్ట్ మెనేజర్‌గా ఉద్యోగజీవితాన్ని ప్రారంభించింది. ఎన్విరాన్‌మెంటల్ సస్టెయినబిలిటీ కార్యాలయం(యూఎస్)లో జియోగ్రాఫిక్ ఇన్‌ఫర్‌మేషన్ స్పెషలిస్ట్‌గా పనిచేసింది. 'ది ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఫ్యూచర్'లో కన్సల్టెంట్‌గా, యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో గ్రాడ్యుయేట్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసిన ఛాయ ఆ తరువాత డాటా-డ్రివన్, సోషల్ ఇంపాక్ట్ ప్రాజెక్ట్‌లపై దృష్టి పెట్టింది. 'మెటా'లో 'డాటా ఫర్ ఇనిషియేటివ్' హెడ్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించింది. ఫేస్‌బుక్‌లో ఓపెన్ రీసెర్చ్ అండ్ ట్రాన్స్‌పరెన్సీ(ఫోర్ట్) హెడ్‌గా పనిచేసింది. 'ఓపెన్ ఏఐ'లోకి రావడానికి ముందు ఫేస్‌బుక్‌లో జనరేటివ్ ఏఐ ప్రాజెక్ట్ మెనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా పనిచేసింది. 'మెటాలోని తొలి రోజులు నిన్నా మొన్నా జరిగినట్లే అనిపిస్తున్నాయి. మెటాలో పని చేసిన అనుభవం నా కెరీర్‌కు గట్టి పునాది వేసింది' అంటుంది ఛాయ. 'నా ప్రయాణం ఆగిపోలేదు. పుస్తకంలో ఒక పేజీని తిప్పాను. అంతే!' అని లింక్‌డ్ ఇన్ పోస్ట్‌లో కంపెనీ మార్పు గురించి రాసింది ఛాయానాయక్.

● డిజిటల్ అలర్ట్

అలా... ఆమె ప్రాణాలు కాపాడారు!



ఉత్తర్‌ప్రదేశ్‌లోని బరేలికి చెందిన అమ్మాయి ఒకరు 'నేను ఆత్మహత్య చేసుకోబోతున్నాను' అని అర్ధరాత్రి దాటిన తరువాత ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టింది. 'మెటా' వెంటనే ఈ పోస్ట్‌ను స్టేట్ పోలీస్ మీడియా సెంటర్‌కు పంపి పోలీసులను అలర్ట్ చేసింది. కేవలం పదహారు నిమిషాల వ్యవధిలో ఒక సబ్-ఇన్‌స్పెక్టర్, కొందరు మహిళా పోలీసులు ఆ అమ్మాయి ఉన్న ఇంటికి చేరుకున్నారు. వాంతులు చేసుకున్న ఆ అమ్మాయి నిస్తేజంగా పడి ఉంది. వెంటనే ఆమెను హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు.

సమయానికి ఆస్పత్రికి తీసుకురావడం వల్ల ఆ అమ్మాయి చావు నుంచి బయటపడింది. ఆమె కోలుకున్న తరువాత... 'ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలనుకున్నావు?' అని అడిగితే... తాను ప్రేమించిన వ్యక్తి మాట్లాడడం మానేశాడని, తన ఫోన్ నంబర్ బ్లాక్ చేశాడని...ఇలా చెప్పుకుంటూ పోయింది.

పెరుగుతున్న ఆన్‌లైన్ సుసైడ్ అటెంప్ట్స్‌ను దృష్టిలో పెట్టుకొని ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు, మెటా భాగస్వామ్యంతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో సుసైడ్-రిలేటెడ్ పోస్ట్‌లపై నిఘా పెడుతున్నారు. వెంటనే రంగంలోకి దిగుతున్నారు. జనవరి 1, 2023 నుంచి ఆగస్ట్ 25, 2025 వరకు 1,315 మంది ప్రాణాలను కాపాడారు.

బులియన్
(బంగారం 10 గ్రా.; వెండి కిలో)
సెప్టెంబర్ 3న ముగింపు రూ.లలో

	బంగారం (24 క్యారెట్లు)	బంగారం (22 క్యారెట్లు)	వెండి
హైదరాబాద్	1,06,810	99,890	1,27,000
విజయవాడ	1,08,950	98,050	1,26,300
విశాఖపట్నం	1,06,970	98,050	1,37,000
రాజమండ్రి	1,08,950	1,00,990	1,26,300
ప్రొద్దుటూరు	1,07,200	98,620	1,26,000
చెన్నై	1,06,960	98,050	1,37,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.